కరిచేస్తున్నా పట్టించుకోరా?



సింథియా: జీవీఎంసీ 40, 62, 63వ వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. విచ్చల విడిగా సంచరిస్తూ ప్రజలపై దాడికి పాల్పడుతున్నాయి. దీంతో రోడ్లపైకి రావాలంటే వణుకుతున్నారు. ఏకేసీ కాలనీ, చింతల్లోవ, క్రాంతినగర్, జయేంద్రకాలనీ, కాకరలోవ, త్రినాథపురం, దుర్గానగర్, గుడివాడఅప్పన్నకాలనీ, ప్రకాష్‌నగర్, జనతా కాలనీ, శ్రీహరిపురం, మల్కాపురం తదితర ప్రాంతాల్లో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. వీధుల్లో కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే హడలెత్తిపోతున్నారు. ప్రయాణికులను వెంటపడి తరుముతుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

- పారిశ్రామిక ప్రాంతంలో గ్రామసింహాల స్వైర విహారం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- వెంటాడిమరీ గాయపరుస్తున్న వీధికుక్కలు
- వీధికుక్కల నియంత్రణను గాలికి వదిలేసిన వైనం

మొర వినరూ!

వీధికుక్కల నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఫలితం ఉండడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల ఉత్పత్తికి చెక్ పెట్టే చర్యలు చేపట్టాలని, కుక్కల దాడుల నుంచి ప్రజలను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

అందుబాటులో ర్యాబిస్ వ్యాక్సిన్

వీధి కుక్కల దాడితో గాయపడిన వారికి వెంటనే ర్యాబిస్ వ్యాక్సిన్ వేయడం వల్ల కొంతవరకు ప్రమాదాన్ని అరికట్టవచ్చు. జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీ యూపీహెచ్‌సీలో సుమారు 40 వ్యాక్సిన్లు, 63వ వార్డు క్రాంతినగర్ యూపీహెచ్‌సీలో 50, గుల్లలపాలెం ప్రభుత్వాస్పత్రిలో 120 వరకు ర్యాబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.



40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలో క్రీడామైదానంలో వీధి కుక్కల స్వైర విహారం

నియంత్రణ లేకపోవడం వల్లే అనర్థాలు

పారిశ్రామిక ప్రాంతంలోని వీధి కుక్కల నియంత్రణపై అధికారులు దృష్టి సారించకపోవడం వల్లే అనర్థాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వీధి కుక్కలను డాగ్ క్యాచర్స్ ద్వారా ఆధీనంలోకి తీసుకుని వేసెక్టమి ఆపరేషన్లు చేయించాలని కోరుతున్నారు. వ్యాక్సిన్లు వేయించడం, ఆపరేషన్లు చేయడం ఖర్చుతో కూడుకున్న పని కావడం, పైగా కుక్కలను తీసుకువచ్చి ఆపరేషన్‌కు ముందు వారం రోజులు, ఆపరేషన్ తర్వాత వారం రోజులు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉండడంతో కుక్కలను నిర్మూలించడం సాధ్యం కాదనే సాకుతో చేతులెత్తేసి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కుక్క దాడిలో గాయపడిన బాలుడు

పదుల సంఖ్యలో కుక్కకాటు బాధితులు



కుక్క దాడితో గాయపడిన మహిళ

పారిశ్రామిక ప్రాంతంలోని వివిధ ప్రాంతాల్లో గతేడాది డిసెంబర్ నెలలో 10 మంది, ఈ ఏడాది జనవరిలో 15 మంది, ఫిబ్రవరిలో 12 మంది, మార్చిలో 13మంది, ఏప్రిల్‌లో 15 మంది కుక్కకాటుకు గురై గుల్లలపాలెం ప్రభుత్వాస్పత్రిలో, క్రాంతినగర్ యూపీహెచ్‌సీ, 40వ వార్డు ఏకేసీకాలనీలోని యూపీహెచ్‌సీలో చికిత్స పొందినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఒక్క ప్రభుత్వాస్పత్రుల్లోనే కుక్కకాటుకు గురైన వారి సంఖ్య ఈ స్థాయిలో ఉంటే, ఇక ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే వారి సంఖ్య ఇంకెంత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. వీధుల్లో తిరిగే వారినే కాకుండా ద్విచక్రవాహనాలపై వెళ్తున్న వారిని సైతం కుక్కలు వెంబడించడంతో వాహనదారులు ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి.



63వ వార్డులో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

బయటకువెళ్లాలంటే భయం



మా ప్రాంతంలో వీధి కుక్కలు చాలా ఎక్కువగా ఉన్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా గుంపులు గుంపులుగా తిరుగుతూ మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి. ఇటీవల మా వీధిలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళను వెంబడించి మరీ గాయపరిచాయి. అప్పటి నుంచి బయటకు రావాలంటే భయమేస్తోంది. అధికారులు చర్యలు చేపట్టాలి.

– నిర్మల, 40వ వార్డు

వీధి కుక్కలను నియంత్రించాలి



ప్రజలపై వీధి కుక్కల దాడులు అధికమవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. ఎక్కడి నుంచో కుక్కలు తీసుకువచ్చి మరీ మా ప్రాంతాల్లో వదిలేస్తున్నారు. ఆ కుక్కలు చిన్నపిల్లలు వీధుల్లోకి రాగానే వెంబడించి గాయపరుస్తున్నాయి. వాహనదారులను వెంబడించడంతో అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– కృష్ణవేణి, 63వ వార్డు

శ్యామలాంబను దర్శించుకున్న శ్రీధర్



అమ్మవారిని దర్శించుకున్న శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 57వ వార్డు శ్యామ్‌నగర్ కాలనీలోని మంగళవారం శ్యామలాంబ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సంబరాలు అట్టహాసంగా నిర్వహించారు. పరిసర ప్రాంత ప్రజలు పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని నగర పాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పరిశుభ్రతపై బాలికలకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న బాలికలు

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా రుతుక్రమంలో బాలికలు పాటించాల్సిన జాగ్రత్తలు, లైంగిక విద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లైంగిక విద్యపై అవగాహన ఏర్పరుచుకోవాలన్నారు. రుతుక్రమ సమయంలో వాడే ఉత్పత్తులు, వాటిని ఏ విధంగా పారవేయాలో వివరించారు. సచివాలయ మహిళా పోలీస్ రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ ద్రాక్షాయిని, ఆశాకార్యకర్త జి.సుందరమణి, సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చదువుతో సమాజంలో గౌరవ ప్రదమైన స్థానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

మల్కాపురం: చదువు వల్ల సమాజంలో గౌరవం లభిస్తుంది.. జ్ఞానం,నైపుణ్యాలు, ఆలోచనా శక్తి పెరుగుతాయని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు.వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలోమంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చదువు వల్ల ఉద్యోగాలు లభిస్తాయని, వ్యక్తిత్వం వికసిస్తుందని,స్వతంత్ర ఆలోచనలు వస్తాయని చెప్పారు. విద్య ద్వారా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లాంటి వారు ఎలా అభివృద్ధి చెందారో స్ఫూర్తిదాయకంగా తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ఆమె అభినందించి,సర్టిఫికెట్‌లు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్, సామాజిక సేవా కార్యకర్త జగదాంబ,జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



కార్యక్రమంలో మాట్లాడుతున్న కోరమాండల్ డీజీఎం రెడ్డిపల్లి శ్రీనివాసరావు

మల్కాపురం: మే డే ను పురస్కరించుకుని కోరమాండల్ ఫెర్టిలైజర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదానం శిబిరం నిర్వహించారు.సంస్థ పరిపాలన భవనం వద్ద జరిగిన కార్యక్రమాన్ని సంస్థ డీజీఎం (హెచ్ ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు,యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ .నర్సింగరావు,ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.బాషా ప్రారంభించారు. రక్తదానం చేసిన కార్మికులను అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు వెండి ఆభరణం బహూకరణ



పూజలో పాల్గొన్న భక్తులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు జనతాకాలనీలోని దుర్గామాత ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్థానికులు జయశంకర్,గోపి తదితరులు అమ్మవారికి కుంకుమాభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారికి వెండి ఆభరణం బహూకరించారు. మధ్యాహ్నం అన్న ప్రసాదాలను వడ్డించారు.సాయంత్రం అమ్మవారికి నక్షత్ర హారతి పూజలు చేశారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల పోరాటానికి డీవైఎఫ్ఐ మద్దతు



కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల దీక్షకు మద్దతు తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

సీతంపేట: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గత కొన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌వోలు) చేస్తున్న పోరాటానికి మంగళవారం డీవైఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ మద్దతు తెలియజేసింది. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీహెచ్‌వోలు చేస్తున్న నిరసన దీక్షలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు యూఎస్ఎన్ రాజు ప్రసంగిస్తూ గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను వేధించడం తగదు అన్నారు. వారి న్యాయమైన డిమాండ్లు అయిన ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఆరు సంవత్సరాలు సర్వీస్ పూర్తయిన వారి ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలని, నిర్దిష్టమైన జాబ్ చార్ట్ ఇవ్వాలని, 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, గత ఏడు నెలలుగా బకాయి ఉన్న ఇన్సెంటివ్‌లు చెల్లించాలని, ఈఈఎఫ్‌వో పునరుద్ధరించాలని, ఎఫ్ఆర్ఎస్‌లో మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సంతోష్ కుమార్, ఉమా శైలజ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పైడితల్లమ్మ పండగ



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రశాంతినగర్‌లో వెలసిన పైడితల్లి అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు కుంకుమలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి చీరలు, గాజులు పసుపు, కుంకుమలు సమర్పించుకున్నారు.

తప్పని నిరీక్షణ

భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తడంతో క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. అయితే చలువ పందిళ్లు వేయడం వల్ల ఇబ్బందిపడలేదు. భక్తుల సేవలో స్వచ్ఛంద సేవా సంస్థలు తరించాయి. దర్శనాలకు వచ్చిన భక్తులకు మంచినీరు, మజ్జిగ అందించారు. గోపాలపట్నం వాకర్స్ క్లబ్ సభ్యులు హాట్ పొంగలి ప్రసాదం అందించారు. మరికొందరు పులిహోర పంపిణీ చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు...

సాయంత్రం సమయంలో ఆలయ పరిసర ప్రాంతంలో పరస నిర్వహించారు. పరసను చూసేందుకు స్థానికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ వారు హౌసీ నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు అందించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సుర్రుమన్న సూరీడు



ఎండలో చీర పూర్తిగా కప్పుకుని వెళ్తున్న మహిళ



చున్నీయే రక్ష

మల్కాపురం: భానుడు భగభగమన్నాడు. నడినెత్తిన సుర్రుమన్నాడు. నిప్పులు కురిపించి బెంబేలెత్తించాడు. మంగళవారం ఉదయం నుంచే భానుడు తన ప్రతాపం చూపాడు.రోడ్లన్నీ ఖాళీగా కనిపించాయి. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్లపైకి వచ్చిన వారు విలవిల్లాడారు. నెత్తిన గొడుగులు, ముఖానికి ముసుగులు వేసుకుని వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి ప్రయత్నించారు. సర్వీసు రోడ్ల వెంబడి ఎక్కడా షెల్టర్లు కానరాకపోవడంతో అవస్థలు పడ్డారు. వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు డీలా పడ్డారు.



ఎండ వేడికి తట్టుకోలేక తలపై చున్నీ కప్పుకుని వెళ్తున్న మహిళలు

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతగా నిలిచిన జట్టుతో వీసీ, రిజిస్ట్రార్



రన్నర్‌గా నిలిచిన జట్టుతో వీసీ, రిజిస్ట్రార్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పరిపాలన భవన కార్యాలయాల సిబ్బంది మధ్య నిర్వహించిన క్రికెట్ పోటీల్లో నియాన్ గ్రీన్ కలర్స్ జట్టు విజయం సాధించింది. బ్లూ బ్లాస్టర్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. మంగళవారం జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ విజేతలకు, రన్నర్‌లకు బహుమతులు అందజేశారు. గ్రీన్ థండర్స్ మేనేజర్ డా.పి.వి.ఎస్.ఎన్.వి.సాంబమూర్తి, కెప్టెన్ పి.రాజేంద్ర ప్రసాద్, బ్లూ బ్లాస్టర్స్ మేనేజర్ ఆర్.శ్రీనివాస్, కెప్టెన్ కె.సంతోష్ కుమార్ , ఇతర క్రీడాకారులను అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనంజయరావు పాల్గొన్నారు.

తూకంలో మోసం చేస్తే కఠిన చర్యలు



తనిఖీలు చేసి స్వాధీనం చేసుకున్న కాటాలను పరిశీలిస్తున్న అధికారులు



సీజ్ చేసిన కాటాలు

- గోపాలపట్నం చేపల బజార్‌లో తూనికలు కొలత విభాగం అధికారుల తనిఖీలు
- 20 కాటాలు సీజ్
- కిలోకి 250 నుంచి 300 గ్రాముల వ్యత్యాసం
- బరువు తగ్గించేందుకు ప్రత్యేకంగా స్విచ్‌ల ఏర్పాటు
- బేరాలాడితే ఈ స్విచ్‌తో బాదుడే..

గోపాలపట్నం: గోపాలపట్నం బంక్ సమీపంలో ఉన్న చేపల బజార్‌లో తూనికల కొలతల విభాగ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 20 డిజిటల్ వేయింగ్ మిషన్లను సీజ్ చేశారు. వీటిలో తప్పుడు తూకం చూపించే విధంగా ఏర్పాట్లు చేశారని, అందుకే సీజ్‌చేస్తున్నామని అధికారులు తెలిపారు.

తగ్గించే తూకాలు...

పీసు బేరాలాడితే ఆవినియోగదారునికి తూకంలో దెబ్బ పడినట్లె. అందుకే ప్రత్యేకంగా కనిపించని విధంగా స్విచ్ ఏర్పాటు చేశారు. ఇది నొక్కితే చాలు కిలోకి 250 నుంచి 300 వరకు బరువు తగ్గించేస్తాయి.

వినియోగారులు అప్రమత్తంగా ఉండాలి...

వినియోగదారులు కొనుగోలు చేసినప్పుడు అప్రమత్తంగా ఉండాలని లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోల్ కె. థామస్ రవికుమార్ అన్నారు. దుకాణదారులు తూనికల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి వారం ఈ తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. వినియోగదారులకు మంచి ధర కల్పించి తూనికల్లో అక్రమాలు లేకుండా వ్యాపారాలు చేయాలని సూచించారు. ఇక్కడి బజారుపై తరచూ ఫిర్యాదులు రావడంతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని తెలిపారు. ఎన్ఏడీ నుంచి గోపాలపట్నం, వేపగుంట వరకు తనిఖీలు చేశామన్నారు. బజారులో 20 డిజిటల్, మామూలు కాటాలు సీజ్ చేశామన్నారు. ఈ కాటాలు కలిగిన వ్యాపారులకు జరిమానాలు విధిస్తామన్నారు. సహాయ నియంత్రికులు పీడీపీ అప్పలరాజు, ఎస్ఎం రాధాకృష్ణ, బి. రామచంద్రయ్య, చిన్నమ్మ, ఇన్‌స్పెక్టర్లు బి. రామారావు, ఉమా సుందరి, అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి నిరోధమే లక్ష్యం

మహారాణిపేట: అవినీతి నిరోధానికి ముందస్తు చర్యలపై ప్రజలు, ఉద్యోగుల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో విశాఖ పోస్టల్ డివిజన్ ప్రత్యేకంగా విజిలెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. దీనిపై వెలంపేట హెడ్ పోస్టల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పోస్టుమాస్టర్ జనరల్లు డీఎస్‌వీఆర్ మూర్తి, పి.ఉపేంద్ర, డైరెక్టర్ (హెడ్ క్వార్టర్స్) గజేంద్ర కుమార్ మీనా, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టు ఆఫీసు పి.కోమల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కిశోరి వికాసం'తో బాలికల భవితకు పునాది

విశాఖ విద్య: 'కిశోరి వికాసం' కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు, ఆరోగ్యానికి పునాది వేస్తుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ వరలక్ష్మి పేర్కొన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి ఎంవీ రమణకుమారి ఆదేశాల మేరకు కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 90 వ వార్డు బుచ్చిరాజుపాలెం అంగన్‌వాడీ 2,3, కేంద్రాలు, అదే విధంగా 52వవార్డు అంబేడ్కర్‌నగర్‌లో మంగళవారం మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి పోస్టరు ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. 11 నుంచి18 ఏళ్ల మధ్య బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన మెరుగుపర్చడమే ఈ కార్యక్రమం లక్ష్యమని వివరించారు.



90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రుతు స్రావం – పరిశుభ్రత, పద్ధతులు, ఐరన్ , విటమిన్–సి సమృద్ధిగా ఉన్న సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం తార, కె. ఈశ్వరమ్మ, ఆర్. స్నేహప్రియ, పి గౌతమి, బి. లక్ష్మి ,ఆశా కె. కనకదుర్గ , అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శోధన, పరిశోధన పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కె.సి.రెడ్డి

సీతంపేట: గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ రచించిన శోధన, పరిశోధన పుస్తకావిష్కరణ కార్యక్రమం లంకపల్లి బుల్లయ్య కళాశాలలో మంగళవారం జరిగింది. ప్రొఫెసర్ కె.సి.రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలమోహన్‌దాస్ నేటి సమాజానికి అవసరమైన ఆలోచనాపరుడు, తత్వవేత్త అని కొనియాడారు. బాలమోహన్‌దాస్ రచించిన సంకలనంలో విభిన్న రంగాలకు సంబంధించిన విషయాలను కూలంకషంగా పొందుపరిచారని తెలిపారు. రచయిత తన కెరీర్‌లో అనుసరించిన సూత్రాలను ఈ సేకరణలో పొందుపరిచినట్టు తెలిపారు. సభాధ్యక్షుడు, బుల్లయ్య కళాశాల సెక్రటరి జి. మధుకుమార్ మాట్లాడుతూ బాలమోహన్‌దాస్ సమాజాన్ని మేధోసంపత్తితో సుసంపన్నం చేసే దిశగా వ్యాసాలను పొందుపరిచి విలువైన సంపుటిగా తీర్చిదిద్దారని కొనియాడారు. భవిష్యత్ తరాలకు ఈ వ్యాసాలు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. బొబ్బిలి రాజా కళాశాల మాజీ ఆంగ్ల విభాగాధిపతి వినయభూషణరావు పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆండాల్ అమ్మిశెట్టి, డాక్టర్ కె.కుమార్‌రాజా, రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి, విశాఖ సంస్కృతి మాస పత్రిక సంపాదకుడు శిరేల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.